కేటీఆర్, హరీశ్‌రావులపై గజ్జెల కాంతం ఫైర్


మాట్లాడుతున్న గజ్జెల కాంతం

బంజారాహిల్స్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కేటీఆర్, హరీశ్‌రావును తన్నితరిమేసే రోజులు దగ్గర పడ్డాయని తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం అన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు శాంతియుతంగా ఉన్నారని, బీఆర్ఎస్ అందరినీ తప్పుదోవ పట్టిస్తుందని ఆరోపించారు. బంజారాహిల్స్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేటీఆర్, హరీశ్‌రావు రాజకీయ లబ్ధికోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డిని విమర్శించే హక్కు వారికి లేదన్నారు. సీఎం, మంత్రులు అహర్నిశలు శ్రమిస్తూ రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఓటమి భయంతోనే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను నిలబెట్టడం లేదని ఆయన విమర్శించారు.


జెండాను ఆవిష్కరించిన సాయిబాబా

కార్మికుల సంక్షేమమే ధ్యేయం

- **1104 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబా**

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేసేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని 1104 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సాయిబాబా అన్నారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ఏర్పడిన యూనియన్ 75 సంవత్సరాలుగా విద్యుత్ రంగ కార్మికులు, ఉద్యోగుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి పోరాడుతుందన్నారు. ప్లాటినం జూబ్లీవేడుకల సందర్భంగా ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లోని యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1950 ఫిబ్రవరి 12 నుంచి నేటి వరకు యూనియన్ కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సబ్‌స్టేషన్, మండల, డివిజన్, జిల్లా, ట్రాన్స్‌కో, జెన్‌కో స్థాయిలో ప్లాటినం జూబ్లీ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయన్నారు. తమ యూనియన్ ఏ రాజకీయ పార్టీకి కూడా అనుబంధంగా లేదని, కేవలం కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసమే పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన యూనియన్ నాయకులను సన్మానించారు. క్యాక్రమంలో దక్షిణ డిస్కం అధ్యక్షుడు వేణు, జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

జీటీఎస్ కాలనీలో..

పంజాగుట్ట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడంతో పాటు విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104 యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.వెంకటేశ్వర్లు, జి.సాయిబాబా అన్నారు. బుధవారం జీటీఎస్ కాలనీలో యూనియన్ ప్లాటినం జూబ్లీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు యూనియన్ జెండాను ఎగురవేసి, కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, జనార్ధన్ రెడ్డి, డిస్కం అధ్యక్షుడు ఏ.వేణు, రీజనల్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.సర్వేశ్వర్, టి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.


ట్యాంకర్ డ్రైవర్లకు సూచనలు చేస్తున్న ఏసీపీ హరిప్రసాద్

ర్యాష్ డ్రైవింగ్ చేస్తే సహించం

- **ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్**

బంజారాహిల్స్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలను పాటించకుంటే లైసెన్స్ రద్దు చేస్తామని పశ్చిమ మండలం ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ హెచ్చరించారు. వివిధ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో వాటర్ ట్యాంకర్ల డ్రైవర్లకు ఆయన బుధవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ట్యాంకర్ డ్రైవర్లు అధిక ట్రిప్పుల కోసం ఇష్టం వచ్చినట్టు వాహనాలు నడుపుతున్నారని, దీని వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు. ఇకపై ర్యాష్ డ్రైవింగ్ చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.

మహార్, నేతకానిలకు అండగా ఉంటా

- **మంద కృష్ణమాదిగ**



మాట్లాడుతున్న మంద కృష్ణ

పంజాగుట్ట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న మాదిగ సామాజిక వర్గమే మాలలతో తట్టుకోలేక పోయిందని, వర్గీకరణ గ్రూపు-3లో ఉన్న మహార్, నేతకాని కులస్థులు ఎలా తట్టుకుంటారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ అన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మనవడు ప్రకాష్ అంబేడ్కర్ వర్గీకరణ సరైందని, రిజర్వేషన్ ఫలాలు అందరికీ అందాలని చెప్పారన్నారు. జాతీయ మహార్ నేతకాని ఐక్య వేదిక ఆధ్వర్యంలో వేదిక నాయకులు నారాయణ దుర్గే మహార్ అధ్యక్షతన బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మహార్, నేతకానిలకు ప్రత్యేక గ్రూపు ఏర్పాటు చేసి రిజర్వేషన్ కేటాయించాలనే అంశంపై ఏర్పాటు చేసిన సమావేశంలో మందకృష్ణ మాదిగ, పెద్దపల్లి మాజీ ఎంపీ డాక్టర్ బోర్లకుంట వెంకటేష్ నేత ముఖ్య అతిథులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ.. మహార్, నేతకాని కులాలకు అన్యాయం జరగకుండా చూస్తానన్నారు. దళితుల జీవితాలను బాగు చేసిన అంబేడ్కర్ మహార్ జాతికి చెందిన వారేనన్నారు. దళితులలో 59 కులాలకు దక్కాల్సిన వాటాను ఒక్క మాల కులమే ఇప్పటి వరకు అనుభవించిందని ఆరోపించారు. సర్టిఫికెట్‌ల కోసం మహార్, నేతకానిలు తమ అస్తిత్వం కోల్పోవద్దని, తహసీల్దార్‌ల ద్వారా కుల సర్టిఫికెట్ సాధించుకోవాలని సూచించారు.

మానసిక కుంగుబాటుతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పంజాగుట్ట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): భార్యతో విడాకులు తీసుకున్న వ్యక్తి మానసిక కుంగుబాటుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎల్లారెడ్డిగూడలో చోటుచేసుకుంది. పంజాగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిగూడ సుభాష్‌నగర్‌లో ఉంటున్న జి.శ్రీకాంత్(37)కు 2012లో విశాఖపట్నంకు చెందిన శ్రీలతతో వివాహం జరిగింది. వారికి ఒక కుమార్తె ఉండగా, పలు కారణాలతో 2022లో విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి శ్రీకాంత్ తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. పది నెలల క్రితం వారు మౌలాలికి వెళ్లిపోగా అప్పటి నుంచి శ్రీకాంత్ ఒక్కడే ఉంటున్నాడు. ఈ క్రమంలో మానసిక కుంగుబాటుకు గురై మద్యానికి అలవాటు పడ్డాడు. ఈ నెల 10న రాత్రి తల్లి దుర్గాంబ అతనికి కాల్ చేస్తే ఫోన్ లిఫ్ట్ చేయలేదు. 11న ఉదయం నుంచి రాత్రి వరకు పలుమార్లు ఫోన్ చేసినా శ్రీకాంత్ నుంచి స్పందన లేదు. బుధవారం ఉదయం మళ్లీ ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో ఆందోళన చెందిన ఆమె ఇంటికి వచ్చింది. వాచ్‌మెన్, స్థానికుల సహాయంతో తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా శ్రీకాంత్ ఉరేసుకుని కనిపించాడు. స్థానికులు పంజాగుట్ట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


సర్వే నిర్వహిస్తున్న ఎన్యూమరేటర్లు (ఫైల్)

కొత్త రేషన్‌కార్డుల లెక్క తేలింది

డివిజన్‌ల వారీగా జాబితా సిద్ధం

- సర్వే ప్రక్రియపై విమర్శలను పట్టించుకోని అధికారులు
- దరఖాస్తు చేసుకున్న వారిలో 47 శాతం మందికే కార్డులు
- సర్కిల్-7 పరిధిలో త్వరలో పంపిణీకి ఏర్పాట్లు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డుల లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ పూర్తయింది. ప్రజా పాలనలో భాగంగా రేషన్ కార్డులు లేని వారు దరఖాస్తు చేసుకున్నారు. వాటి ఆధారంగా ఓ జాబితా రూపొందించి ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారు. అయితే కొన్నిచోట్ల అసలు ఎన్యూమరేటర్లు ఇళ్లకు వెళ్లలేదనే విమర్శలు వెల్లువెత్తినప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం తుది జాబితాను సిద్ధం చేశారు. రేషనింగ్ ఖైరతాబాద్ సర్కిల్-7 పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ, వెంగళరావునగర్, అమీర్‌పేట, సనత్‌నగర్ పరిధిలో డివిజన్ల వారీగా లబ్ధిదారుల జాబితాను రూపొందించారు. ఇప్పటికే కొత్త రేషన్‌కార్డులు మంజూరైన వారి పేర్లు ఆన్‌లైన్‌లోకి ఎక్కించారు. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే వీరికి ఆహార భద్రత కార్డులు అందజేస్తారు. అయితే గత నెల 26న రిపబ్లిక్ డే రోజున డివిజన్‌కు కొన్ని చొప్పున గుర్తించిన వారికి మొదటి దశలో కార్డులు పంపిణీ చేయాలని నిర్ణయించారు. హైదరాబాద్‌లో మాత్రం ఈ ప్రక్రియ ఇంకా ప్రారంభం కాకపోవడంతో కొత్తగా రేషన్‌కార్డు పొందిన వారు ఈ నెల రేషన్ తీసుకోవడానికి అర్హత సాధించలేకపోయారు. రేషనింగ్ ఖైరతాబాద్ సర్కిల్-7 పరిధిలో మొత్తం 6,096 మంది ప్రజాపాలన దరఖాస్తుల అర్హుల జాబి తాతో గత నెల 21వ తేదీ వరకు అర్హుల ఎంపికను పూర్తిచేశారు. అర్హులను ప్రభుత్వమే గుర్తించి ఈ మేరకు లబ్ధిదారుల జాబితాను ఖైరతాబాద్ సర్కిల్-7 కార్యాలయానికి పంపించింది. అంతేకాకుండా ఏ డివిజన్ నుంచి ఎన్ని దరఖాస్తులు సర్వే చేశారు, ఎంతమంది లబ్ధిదారులుగా గుర్తించారు అనే వివరాలను సైతం సర్కిల్-7 కార్యాలయానికి పంపించారు. మొత్తం 6,096 మంది అర్హులను గుర్తించి సర్వే చేయగా ఇందులో 2,897 మంది రేషన్ కార్డుకు ఎంపికయ్యారు. సర్వే చేసిన వారిలో 3199 మంది అనర్హులుగా తేలారు. కేవలం ఈ సర్కిల్‌లో 47.52 శాతం మంది మాత్రమే రేషన్ కార్డుకు అర్హత సాధించారు.

ఏ డివిజన్ పరిధిలో ఎన్ని కార్డులంటే..

డివిజన్ పేరు	ఎంతమందిని సర్వే చేశారు	కార్డు మంజూరైన వారు
అమీర్‌పేట	205	31
సనత్‌నగర్	482	236
ఖైరతాబాద్	540	211
సోమాజిగూడ	732	265
వెంకటేశ్వరకాలనీ	260	88
బంజారాహిల్స్	561	361
జూబ్లీహిల్స్	455	391
యూసుఫ్‌గూడ	401	176
వెంగళరావునగర్	465	192
ఎర్రగడ్డ	481	150
రహ్మత్‌నగర్	783	437
బోరబండ	731	359




నిందితులతో ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ సిబ్బంది

ముగ్గురి హాష్ ఆయిల్ విక్రేతల అరెస్ట్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా హాష్ ఆయిల్ విక్రయిస్తున్న ముఠాలోని ముగ్గురు సభ్యులను ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. సనత్‌నగర్ ఎస్ఆర్‌టీ ప్రాంతంలో ఉండే సాయి వివేక్‌కు అతుల్ సింగ్, సాలెం రాజు స్నేహితులు. సాయి వివేక్‌కు విజయవాడకు చెందిన అరవింద్ అనే వ్యక్తితో పరిచయం ఉంది. అరవింద్ ఏజెన్సీ నుంచి హాష్ ఆయిల్ కొనుగోలు చేసి నగరానికి తీసుకొచ్చి గ్రాము రూ.1000 చొప్పున సాయి వివేక్‌కు ఇస్తాడు. సాయి తన స్నేహితులు అతుల్ సింగ్, సాలెం రాజులతో కలిసి గ్రాము హాష్ ఆయిల్ రూ. 1500 చొప్పున కస్టమర్లకు విక్రయిస్తుంటారు. వీరి దందాపై సమాచారమందుకున్న ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ సిబ్బంది సనత్‌నగర్ ఎస్ఆర్‌టీ క్వార్టర్స్‌లోని సాయి వివేక్ ఇంటిపై దాడి చేశారు. అతడు ఇచ్చిన సమాచారం మేరకు అతుల్ సింగ్, రాజులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 81 గ్రాముల హాష్ ఆయిల్, రెండు బైకులు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. హాష్ ఆయిల్ సరఫరా చేస్తున్న ప్రధాన నిందితుడు అరవింద్ పరారీలో ఉన్నాడని ఎస్‌టీఎఫ్ ఎస్సై బాలరాజు తెలిపారు.

మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి

- **మేయర్ గద్వాల్ విజయలక్ష్మి**


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ విజయలక్ష్మి

బంజారాహిల్స్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందులో భాగంగా రోడ్లు, పార్కుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. బంజారాహిల్స్ డివిజన్ రోడ్ నంబర్ 13, మినిస్టర్స్ క్వార్టర్స్ రోడ్డులో రూ. 80 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను బుధవారం ఆమె ప్రారంభించారు. ప్రేమ్‌నగర్ పార్కును జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో పునరుద్ధరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నగరంలోని ప్రధాన, అంతర్గత రోడ్లను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించిందని, పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. మౌలిక వనరుల అభివృద్ధిలో భాగంగా రోడ్ల పటిష్టతపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు పేర్కొన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండేలా పార్కులను అభివృద్ధి చేయడం ముఖ్యమని, నగరంలోని వాకింగ్ ట్రాక్‌లు, గ్రీన్ స్పేస్‌లు, పార్కులకు మరింత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజలు పార్కులను వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి డివిజన్‌లో ప్రణాళికాబద్ధంగా మౌలిక సదుపాయాల కల్పన చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, ఈఈ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ టికెట్ అమ్ముకున్నారు

- **ఉపాధ్యాయ సంఘంపై ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి ఆరోపణ**



మాట్లాడుతున్న రఘోత్తంరెడ్డి

పంజాగుట్ట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సంఘానికి ప్రాతినిధ్యం వహించని, ఉపాధ్యాయ ఉద్యమ చరిత్ర తెలియని వ్యక్తికి ఉమ్మడి కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టిక్కెట్‌ను ఓ ఉపాధ్యాయ సంఘం అమ్ముకుందని ఎమ్మెల్సీ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి ఆరోపించారు. సంఘంతో సంబంధం లేని వ్యక్తిని అధికారిక అభ్యర్థిగా ఎలా నిలబెడతారని ఆయన ప్రశ్నించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 27న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయని, తనను కాదని ఆ సంఘం ఉద్యమాలతో సంబంధం లేని వ్యక్తికి టికెట్ ఇచ్చిందన్నారు. 30 సంవత్సరాలకు పైగా ఉపాధ్యాయుడిగా చదువు చెప్పడంతో పాటు మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సంఘం నాయకుడిగా ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలపైన పోరాటం చేశానన్నారు. గత ఆరు సంవత్సరాలుగా ఎమ్మెల్సీగా ఉపాధ్యాయుల సమస్యలను శాసనమండలిలో లేవనెత్తానని ఆయన పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కార్పొరేట్‌లను గెలిపిస్తే మన ఉనికికే ప్రమాదమని, ఉపాధ్యాయులు తమ మొదటి ప్రాధాన్యత ఓటును తనకు వేసి గెలిపించాలి ఆయన విజ్ఞప్తి చేశారు.

మున్నూరుకాపులను తప్పుగా లెక్కించారు

- **సీఎం ఇంటి ముట్టడికి యత్నించిన ఆత్మగౌరవ సేన**


ఆందోళనకారులను అరెస్టు చేస్తున్న పోలీసులు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కులగణనలో మున్నూరు కాపులను తప్పుగా లెక్కించారని మున్నూరు కాపు ఆత్మగౌరవ మహాదరణ సేన ఆరోపించింది. ఈ తప్పులను వెంటనే సరిచేయాలని డిమాండ్ చేస్తూ సంస్థ ప్రతినిధులు బుధవారం జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడికి యత్నించారు. దీంతో జూబ్లీహిల్స్ పోలీసులు వారిని అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా సేన కన్వీనర్ ఉగ్గే శ్రీనివాస్ పటేల్ మాట్లాడుతూ.. వివిధ జిల్లాల్లో మున్నూరు కాపులను రెడ్లుగా గుర్తించారని, అందుకే ఓసీల శాతం 8 నుంచి 11కు పెరిగిందని ఆరోపించారు. కులగణనకు ముందు మున్నూరు కాపులకు న్యాయం చేస్తానని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, అయితే ఇప్పుడు తీవ్ర అన్యాయం చేశారన్నారు. రూ.5 వేల కోట్లతో మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

వేర్వేరు కేసుల్లో ఇద్దరు సైబర్ నేరగాళ్లు అరెస్ట్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లతో కలిసి మోసాలు చేసిన వ్యక్తిని సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. నగరానికి చెందిన చెరుకు నవీన్ (33) దేశ వ్యాప్తంగా 87 కేసుల్లో సైబర్ నేరగాళ్లకు సహకరించాడు. ఇందులో 14 కేసులు తెలంగాణలో నమోదయ్యాయి. ఇదే విధంగా నగరానికి చెందిన ప్రైవేటు ఉద్యోగిని పార్ట్‌టైం పేరుతో సంప్రదించాడు. పెట్టుబడి పేరుతో పలు దఫాలుగా రూ.25.36 లక్షలు మోసం చేశాడు. కేసు దర్యాప్తులో భాగంగా నవీన్‌పై నిఘా పెట్టిన పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు.

మరో కేసులో ఖాతాలు సమకూర్చే వ్యక్తి..

సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు సమకూర్చుతున్న వ్యక్తిని సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. ఏపీలోని పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన పగడాల ఉమామహేష్ (33) కమీషన్ తీసుకొని సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు సమకూర్చుతున్నాడు. ఇతడిపై దేశ వ్యాప్తంగా 8, తెలంగాణలో 3 కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో అతడిని అరెస్ట్ చేసి 4 మొబైల్ ఫోన్లు, నకిలీ సంస్థల స్టాంపులు, 4 ఏటీఎం కార్డులు, 4 చెక్‌బుక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

ప్రేక్షకులను నవ్వించేందుకే అలా మాట్లాడా

- ఎవరినీ ఉద్దేశించి ఆ వ్యాఖ్యలు చేయలేదు
- సోషల్ మీడియా వేధింపులపై నటుడు పృథ్వీరాజ్ ఆగ్రహం
- సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు

హిమాయత్ నగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో తనను, తన కుటుంబ సభ్యులను వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సినీ నటుడు పృథ్వీరాజ్ బుధవారం సైబర్ క్రైం కార్యాలయంలో కుటుంబ సభ్యులతో కలిసి ఫిర్యాదు చేశారు. ఓ నటుడిగా సినిమా ఫంక్షన్ వేదికపై చేసిన వ్యాఖ్యలతో తనను వైసీపీ సోషల్ మీడియా టార్గెట్ చేసిందన్నారు. ప్రేక్షకులను నవ్వించడానికే అలా మాట్లాడాను తప్ప ఎవరినీ ఉద్దేశించి ఆ వాఖ్యలు చేయలేదన్నారు. వైసీపీకి చెందిన అనిల్ సోషల్ మీడియాలో తనపై అసభ్యకరంగా పోస్టులు పెట్టి వేధించడమే కాకుండా ఇతరులతో కూడా అసభ్యకరమైన పోస్టింగులు పెట్టిస్తున్నాడని, ఫోన్‌లో తిట్టిస్తున్నాడని పృథ్వీరాజ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. సోషల్ మీడియా వేదికల్లో తన ఫోన్ నంబర్ పెట్టి వేధింపులకు గురిచేశారని, రోజుకు 1800 కాల్స్ వరకు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వేధింపులు తాళలేక తాను ఆస్పత్రి పాలయ్యానని, ఇక ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. లైలా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు వచ్చినవారిని నవ్వించడానికి సినిమా డైలాగ్ చెప్పానని, అది తప్పు అన్నట్లుగా తనను, తన కుటుంబ సభ్యులను టార్గెట్ చేసి నీచమైన పదజాలంతో సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఈ వ్యవహారంపై త్వరలో ఏపీ హోంమంత్రిని కలిసి ఫిర్యాదు చేస్తానన్నారు. తనను వేధించిన వారిపై రూ.కోటి పరువు నష్టం దావా వేస్తానని ఆయన పేర్కొన్నారు. కాగా, ఇటీవల పృథ్వీరాజ్ లైలా సినిమా ఈవెంట్‌లో మాట్లాడుతూ కొన్ని వ్యాఖ్యలు చేశారు.

అయితే తమ పార్టీ గురించి, అధినేత జగన్‌ను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశాడంటూ వైసీపీ అభిమానులు పృథ్వీని వేధింపులకు గురిచేస్తున్నారు. నిజానికి పృథ్వీ నివాసం గచ్చిబౌలి, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఉంది. అక్కడే ఫిర్యాదు చేయాలని మొదట నగర సైబర్ క్రైం అధికారులు ఆయనకి సూచించారు. అయితే తన ఆరోగ్యం ఇంకా కుదుటపడలేదని, ఫిర్యాదు ఇక్కడే తీసుకోవాలని కోరడంతో హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేశారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్

ప్రపంచాన్ని మార్చే ఆయుధం విద్య

- **గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ**

బేగంపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): విద్య ప్రపంచాన్ని మార్చే ఆయుధమని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. బుధవారం కత్రియా హోటల్‌లో 'కౌన్సిల్ ఫర్ ఇండస్ట్రియల్ అండ్ ట్రేడ్ డెవలప్‌మెంట్-ఇండియా' (సీఐటీడీ) ఆధ్వర్యంలో ఎడ్యుకేషనల్ ప్రమోషన్ అవార్డ్స్-2025 కార్యక్రమం నిర్వహించారు. సీఐటీడీ సంస్థ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విద్యారంగంలో విశేష కృషి చేసిన సంస్థల ప్రతినిధులను ఈ అవార్డులకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఆధునిక, సాంకేతి పద్ధతుల ద్వారా విద్యనభ్యసించడంతో పాటు సమాజాన్ని అర్థం చేసుకోగలిన పరిజ్ఞానం అవసరమన్నారు. 14 మందికి ఆయన అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు డా.సూరత్ మల్హోత్రా, డైరెక్టర్లు మితేష్ లోహియా, డాక్టర్ బి.భీమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


డీఎస్ఎస్ వార్షిక నివేదికను ఆవిష్కరిస్తున్న ఆకునూరి మురళి తదితరులు

విద్యతోనే మహిళల జీవితాల్లో మార్పు

- **విద్యాశాఖ కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి**

పంజాగుట్ట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): విద్య ద్వారానే మహిళల జీవితాల్లో మార్పు సాధ్యమని విద్యాశాఖ కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. దళిత స్త్రీ శక్తి(డీఎస్ఎస్) సంస్థ ఆధ్వర్యంలో బుధవారం లక్డీకాపూల్ స్మార్ట్ కమర్షియల్ కాంప్లెక్స్‌లోని అంబేడ్కర్ రిసోర్స్ సెంటర్‌లో దళిత ఆదివాసీ స్త్రీలపై హింస, మానసిక ఆరోగ్యం వివిధ కోణాలు అనే అంశంపై సంస్థ జాతీయ కన్వీనర్ ఝాన్సీ గడ్డం అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సంస్థ 19వ వార్షిక నివేదికను ఆవిష్కరించారు. ఆకునూరి మురళి మాట్లాడుతూ.. మనువాద భావజాలంతో స్త్రీలను, దళిత, ఆదివాసీ వర్గాలను విద్యకు దూరంగా ఉంచారన్నారు. మహిళలు, బాలికల హక్కుల సాధనకు డీఎస్ఎస్ పోరాటం అభినందనీయమన్నారు. సీఐడీ ఎస్పీ అనోన్య, జీహెచ్ఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మజ, డిక్కీ జాతీయ అధ్యక్షులు నర్రా రవికుమార్, ట్రాన్స్‌కో డీఈ మాణిక్యం, ఆఫీసర్స్ ఫోరం కన్వీనర్ సిద్దోజీరావు తదితరులు పాల్గొన్నారు.


వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దానం, కార్పొరేటర్ సంగీతాయాదవ్

ఘనంగా గణపతి ఆలయ వార్షికోత్సవం

బేగంపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట గణపతి ఆలయ 25వ వార్షికోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ వనం సంగీతాయాదవ్ స్వామి వారికి పూజలు చేశారు. అనంతరం ఆలయంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపి తెలిపారు.మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు 11కెవి వేదం, ఏపీఐఐసీ-2 ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 వరకు 11కెవి బెంజ్ షోరూం, కాకతీయ హిల్స్, అమర్ సొసైటీ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో.. సాయంత్రం 4 గంటల నుంచి 5 వరకు 11కెవి మెహర్ బాబా ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.



రోడ్డు భద్రతపై అవగాహన

ప్లాన్ ఇండియా స్వచ్ఛంద సంస్థ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో బైబిల్ హౌస్ చౌరస్తా వద్ద బుధవారం ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. మహంకాళి ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఉపశంకర్, ఎస్సై బలరాం నాయక్, ప్లాన్ ఇండియా ప్రతినిధులు పద్మ అరుణ దేవి, సూర్యకళ, నెహ్రూ యువ కేంద్ర వలంటీర్లు రేణుక, లావణ్య, దినేష్ తదితరులు పాల్గొన్నారు. (రాంగోపాల్‌పేట్ - ఆంధ్రజ్యోతి)



అన్నదానం చేస్తున్న టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నరసింహన్

భూలక్ష్మమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

తిరుమలగిరి ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మాఘ మాసం పౌర్ణమి సందర్భంగా బుధవారం బొల్లారంలోని భూలక్ష్మమ్మ ఆలయంలో అభిషేకం, అర్చన లాంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు ఆలయంలో అమ్మవారి కీర్తనలు ఆలపించారు. టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నరసింహన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ అరవింద్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. బొల్లారం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు భారీ సంఖ్యలో విచ్చేసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో జీవి బాల్‌రాజ్, పూర్ణచందర్, దత్తు, రాజు, శశి, రషీద్, సుశీల్, ప్రఫుల్ పాల్గొన్నారు.

152 చీరలతో అమ్మవారికి అలంకరణ



రెజిమెంటల్‌బజార్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మాఘ పౌర్ణమి సందర్భంగా బుధవారం మోండా కుమ్మరిగూడలోని రాజరాజేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారిని 152 చీరలతో అలంకరించారు. లలితా పారాయణ సత్సంగ్ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి ఈ చీరలను అలంకరించారు. కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఎస్ఎస్‌కుమారి, వీరలక్ష్మి, ప్రభావతి, లలితా పారాయణ సత్సంగ్ కమిటీ అధ్యక్షురాలు విజయలక్ష్మి, కార్యదర్శి రుక్మిణి, కోశాధికారి అరుణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎంఎస్ఎంఈ అధికారులు, విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం నాయకులు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

బౌద్ధనగర్, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు వేములవాడ మదన్‌మోహన్ కోరారు. బుధవారం శ్రీనివాసనగర్‌లో జరిగిన సమావేశంలో ఆయనతో పాటు ఎంఎస్ఎంఈ సీనియర్ మేనేజర్ రాజ్‌కుమార్ ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. స్మాల్‌స్కేల్ ఇండస్ట్రీ ద్వారా కేంద్రప్రభుత్వం కులవృత్తుల వారికి ఎటువంటి ష్యూరిటీ లేకుండా సెల్ఫ్ ఎంప్లాయింట్ కింద ఐదు లక్షల నుంచి నలభై లక్షల రూపాయల వరకు లోన్ ఇస్తోందని తెలిపారు. ముందుగా సభ్యులు ఎంఎస్ఎంఈలో సభ్యత్వం తీసుకోవాలన్నారు. సభ్యత్వం కోరకు త్వరలో సమావేశాలు ఏర్పాటుచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాళ్లబండి విష్ణుచారి, బైరోజు రవీందర్‌చారి, గ్రేటర్‌హైదరాబాద్ అధ్యక్షుడు పబ్బోజు బిక్షపతిచారి, నాయకులు చంద్రమౌళి, దయానంద్, రామాచారి, శ్రీనివాస్, రాములు, నరసింహచారి, హరిబాబుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యోగాలో రికార్డు సృష్టించిన భార్గవ్



భార్గవ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కృపాకర్

అడ్డగుట్ట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): యోగాలో యువకులకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం గొప్ప విషయమని యోగా గురువు సాయిబాబా అన్నారు. బుధవారం తుకారాంగేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా స మావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ సిద్ధిపేటలో మంగళవారం నిర్వహించిన శత సహస్ర సూర్య నమస్కార్ కార్యక్రమంలో తుకారాంగేట్‌కు చెందిన తన శిష్యుడు భార్గవ్ జాతీయ స్థాయిలో రికార్డు సృష్టించాడని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ పోటీల్లో 20 జిల్లాల నుంచి 1484 మంది పాల్గొనగా, చివరకు ఐదుగురు 1456 సూర్య నమస్కారాలు చేశారన్నారు. వీరిలో తన శిష్యుడు భార్గవ్ రికార్డు నెలకొల్పాడన్నారు. ఈ సందర్భంగా అతడికి తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందన కృపాకర్ జ్ఞాపిక అందజేసి అభినందనలు తెలిపారన్నారు.

న్యూసెన్స్ చేస్తున్న వ్యక్తికి రెండు రోజుల జైలు



భూమయ్య

రాంగోపాల్‌పేట్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) : తాగి న్యూసెన్స్ చేస్తున్న వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష పడింది. మహంకాళి పోలీస్ ఇన్‌స్పెక్టర్ పరశురామ్ తెలిపిన వివరాల ప్రకారం.. శివాజీ నగర్‌కు చెందిన ఓరుగంటి భూమయ్య(39) దినసరి కూలీ. మద్యానికి బానిసైన ఇతను మంగళవారం సాయంత్రం రాణిగంజ్ హిల్‌స్ట్రీట్ హెచ్‌డీఎఫ్‌సీ వద్ద తాగి న్యూసెన్స్ చేస్తుండగా స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహంకాళి పోలీసులు భూమయ్యను అరెస్ట్ చేసి బీఎన్ఎస్ యాక్ట్ 292 ప్రకారం కేసు నమోదు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా, నిందితుడికి రెండు రోజుల జైలు శిక్ష, 50 రూపాయల జరిమానా విధించారు.

అమ్మో..మీసేవ !

- సెంటర్ల వద్ద జనం బారులు
- ఒక్కో రేషన్ కార్డు దరఖాస్తు అప్‌లోడ్‌కు 20 నిమిషాలు పైనే..
- రోజుకు 50 నుంచి 60 దరఖాస్తులు మాత్రమే స్వీకరణ



సీతాఫల్‌మండి మీసేవ కేంద్రంలో రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటున్న ప్రజలు

బౌద్ధనగర్, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోవటానికి మీ దగ్గరలో ఉన్న మీసేవ కేంద్రానికి వెళ్లతున్నారా.... అయితే రోజుంతా అక్కడే గడపాల్సిందే... ఒక్కో దరఖాస్తు స్వీకరణకు అధిక సమయం పడుతుండటంతో అటు మీసేవ సిబ్బంది... ఇటు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

ఉదయం నుంచే రాక..

ఇటీవల ప్రభుత్వం నూతన రేషన్‌కార్డుల కోసం మీసేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో రెండోరోజు సీతాఫల్‌మండి మీసేవ కేంద్రానికి ప్రజలు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ఉదయమే మీసేవ కేంద్రానికి చేరుకుంటున్న ప్రజలు, మహిళలు నుంచి పూర్తి చేసిన ఓ యాభై దరఖాస్తు ఫారాలకు నెంబర్లు వేసి వారిని నెంబర్ల ప్రకారం పిలుస్తున్నారు. వెనుకవచ్చిన వారికి మరుసటి ఉదయమే రావాలని సిబ్బంది తెలుపుతున్నారు. ముందుగా తీసుకున్నా దరఖాస్తులు పూర్తి అయిన తర్వాత మిగతా వారి తీసుకుంటామని అప్పటివరకు వేచి ఉండాలని కోరుతున్నారు. ముందుగా కంప్యూటర్‌లో నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ కార్డు సైట్‌లోకి వెళ్లి వారి పేరును రేషన్‌కార్డు ఉందా లేదా అని చెక్ చేస్తున్నారు. చాలా మంది పాతరేషన్‌కార్డులో పేర్లను డిలిట్ చేస్తే కొత్తరేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోంటామని మీసేవ సిబ్బందిని అడుగుతుండటంతో పాటు పలు ప్రశ్నలు వేయటంతో విధులకు ఆటంకం కలుగుతోందని సిబ్బంది వాపోతున్నారు.

- సీతాఫల్‌మండి మీసేవ కేంద్రంలో ఐదు కౌంటర్లు ఉండగా, ఒక కౌంటర్ ఆధార్ కార్డుల నమోదు, తప్పుల సవరణ కోసం పనిచేస్తుండగా... మిగతా నాలుగు కౌంటర్లో రేషన్‌కార్డు దరఖాస్తు స్వీకరణతో పాటు కరెంట్ బిల్లు, నీటి బిల్లు ఇతర బిల్లులను స్వీకరిస్తున్నారు. దీంతో రేషన్ కార్డుల పని ముందుకు సాగడం లేదు. ప్రజలు మీసేవ సిబ్బందికి సహకరించాలని మేనేజర్ బాలరాజు కోరారు. సర్వర్ డౌన్ అయితే పని మరింత ఆలస్యం అవుతోందని ఆయన తెలిపారు.

అరుగులపై పడిగాపులు

ఇది ఇలా ఉంటే రేషన్‌కార్డు దరఖాస్తు చేసుకోవటానికి మీసేవ కేంద్రానికి వచ్చే చాలా ఇబ్బందులు పడుతున్నారు. కూర్చోవటానికి కొద్దిపాటి కుర్చీలే ఉండటంతో వారు చాలామంది బయట అరుగులపై కూర్చుంటున్నారు. మంచినీటి సౌకర్యం లేదని పలువురు వాపోయారు. దరఖాస్తులను స్థానికంగా ఉన్న జిరాక్స్ సెంటర్‌లో కొనుక్కుంటున్నారు. చాలామంది మధ్య, పేద తరగతి మహిళలు ఉండటంతో వారికి దరఖాస్తులు పూర్తిచేయటం రాకపోవటంతో రేషన్‌కార్డు దరఖాస్తు ఫారాన్ని పూర్తిచేయాలని ఇతరులను అభ్యర్థిస్తున్నారు.



రేషన్‌కార్డు దరఖాస్తుల ప్రక్రియను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

పరిశీలించిన కార్పొరేటర్

సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ బుధవారం స్థానికంగా ఉన్న మీసేవ కేంద్రంలో రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణ సరళిని పరిశీలించారు. దరఖాస్తు చేసుకోవటానికి వచ్చిన వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మీసేవ కేంద్రం సిబ్బందిని రేషన్‌కార్డుల దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజాపాలనతో దరఖాస్తు చేసుకున్నావారు.. గతంలో దరఖాస్తు చేసుకున్నావారు... ఇప్పుడు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. కొత్తగా పెళ్లైనవారు నూతన రేషన్‌కార్డు కావాలంటే పాతకార్డులో ఉన్న పేరును తొలగిస్తేనే నూతన రేషన్‌కార్డు వస్తుందని తెలిపారు.

ఆర్టీసీ రీజినల్ గౌరవ అధ్యక్షుడిగా పవన్‌కుమార్‌గౌడ్



పవన్‌కుమార్‌గౌడ్‌ను అభినందిస్తున్న ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు

మారేడుపల్లి, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సికింద్రాబాద్ రీజినల్ సర్వసభ్య సమా వేశం బుధవారం పికెట్ జేబీఎస్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా రీజినల్ గౌరవ అధ్యక్షుడిగా జి.పవన్‌కుమార్ గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆర్టీసీ బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి ఈ.నిరంజన్‌తో పాటు అసోసియేషన్ ప్రతినిధులు పవన్‌కుమార్ గౌడ్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు. అలాగే, నూతనంగా ఎన్నికైన సికింద్రాబాద్ రీజినల్ మహిళా విభాగం అధ్యక్షురాలు సుజన, కార్యదర్శి కృష్ణలను శాలువాతో సత్కరించారు. అంతకు ముందు అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను వారు ఆవిష్కరించారు. అనంతరం పవన్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. బీసీ ఉద్యోగులకు క్రిమిలేయర్‌ను రద్దు చేయాలని, ప్రమోషన్లలో రిజర్వేషన్లను కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ ఉద్యోగుల సమస్యలను ఆర్టీసీ యాజమాన్యం, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రధాన కార్యదర్శి నిరంజన్ మాట్లాడుతూ... ఆర్టీసీలోని బీసీ ఉద్యోగులను ఐక్యం చేయడమే ప్రధాన లక్ష్యంగా సంఘం ముందుకు వెళ్తున్నదని అన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు రేణుక, పుష్పలత, పద్మ, పవన్, సీవీ రావు, కృష్ణ, మదర్, గీతతో పాటు రాష్ట్ర, రీజినల్, డిపోలకు చెందిన బీసీ నాయకులు పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీవారి కల్యాణం



వేంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకలో పాల్గొన్న భక్తులు

బోయిన్‌పల్లి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): బోయిన్‌పల్లి న్యూసిటీ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయ 23వ వార్షికోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం కమనీయంగా సాగింది. ఆలయ ధర్మకర్తల కుటుంబ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి వివాహ వేడుకను తిలకించారు. ఆలయ ధర్మకర్తల కుటుంబ సభ్యుల దంపతులు, స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. వరంగల్‌కు చెందిన వేద పండితులు ముడుంబై రంగనాథ్‌చారి బృందం ఆధ్వర్యంలో శ్రీవారి కల్యాణం ఎంతో వైభవంగా నిర్వహించారు. జై శ్రీమన్నారాయణ, జై జై శ్రీమన్నారాయణ నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రామ్మోహన్ రావు, లక్ష్మణ్, ఆత్మానందరెడ్డి, పోకూరి మోహన్‌రావు, జగన్నాథం, యాదయ్య, నర్సింగ్‌రావు, పెంటారెడ్డి, ధర్మవీర్, స్థానికులు బండి శ్రీనివాస్, కారంపూడి నారాయణ, ప్రధాన అర్చకులు పవన్, కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

కళాసిగూడలోని సమస్యలు పరిష్కరిస్తా

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



సమస్యల పరిష్కారంపై అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

రాంగోపాల్‌పేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కళాసిగూడలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బేగంపేట డివిజన్ మినర్వా డౌన్‌లో బుధవారం ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. బస్తీవాసులతో మాట్లాడి సమస్యలు తెలుసుకు న్నారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదని, కలుషిత తాగునీరు సరఫరా అవుతోందని, డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు నీరు పొంగి రోడ్లపై ప్రవహిస్తోందని బస్తీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఆయన తాగునీటి పైప్‌లైన్ లీకేజీలను గుర్తించి కలుషిత నీటి సరఫరాను నియంత్రించాలని, డ్రైనేజీ ఓవర్ ఫ్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వీధి దీపాలు, రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులతో ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ బేగంపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, జలమండలి డీజీఎం శశాంక్, ఈఈ సుబ్రహ్మణ్యం, టౌన్ ప్లానింగ్ డిప్యూటీ సిటీ ప్లానర్ సుస్మిత, బేగంపేట కార్పొరేటర్ టి. మహేశ్వరి, మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లికార్జున్ గౌడ్, బస్తీవాసులు ప్రమోద్, నర్సింగ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా మిర్యాలగూడ స్టేషన్ పునరాభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్

హైదరాబాద్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) : అమృత్ భారత్‌స్టేషన్ పథకం కింద మిర్యాలగూడ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన మిర్యాలగూడ స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించి ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. స్టేషన్ విస్తరణ ప్రణాళికపై అధికారులతో సమీక్షించారు. సర్క్యులేటింగ్ ఏరియా, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, స్టేషన్ మేనేజర్ గదిని సందర్శించి వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. గుంటూరు డివిజన్ డివిజనల్ రైల్వేమేనేజర్ రామకృష్ణతో కలిసి అరుణ్‌కుమార్ జైన్ గుంటూరు-పగిడిపల్లి సెక్షన్‌లో విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించారు. పలు రైల్వే వంతెనలను పరిశీలించారు. గుంటూరు రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యాలు, సర్క్యులేటింగ్ ఏరియా, పాదచారుల వంతెనలను సందర్శించారు. ఈ సందర్భంగా క్రూ బుకింగ్ లాబీ, రన్నింగ్ రూమ్‌లను, సిబ్బందికి సరఫరా చేస్తున్న ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. నల్లపాడు రైల్వేస్టేషన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వసతి సౌకర్యాలను తెలుసుకున్నారు. ఫిర్యాదు రిజిస్టర్‌ను పరిశీలించారు. నల్లపాడు - పిడుగురాళ్ల సెక్షన్ మధ్య రియర్ విండో తనిఖీ నిర్వహించారు. కృష్ణానదిపై ఉన్న ప్రధాన వంతెన తనిఖీ చేస్తూ దానికి సంబంధించిన నిర్వహణ రికార్డులను పరిశీలించారు. తరువాత విష్ణుపురం రైల్వేస్టేషన్‌ను పరిశీలించారు. నల్గొండ, మిర్యాలగూడ స్టేషన్ల తనిఖీల అనంతరం లెవెల్ క్రాసింగ్ గేట్ నంబర్ 54ను పరిశీలించారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరిస్తున్న గేట్‌మ్యాన్‌ను అరుణ్‌కుమార్ జైన్ అభినందించారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న సమాఖ్య సభ్యులు, పాఠశాల విద్యార్థులు

విద్యకు 15 శాతం బడ్జెట్ కేటాయించాలి: టాస్

అడ్డగుట్ట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో విద్యకు 15 శాతం కేటాయించాలని తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య (టాస్) జిల్లా అధ్యక్షురాలు ప్రవల్లిక ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం అడ్డగుట్టలోని బాబూ జగ్జీవన్‌రాం కమ్యూనిటీహాల్‌లో సామాఖ్య రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రవల్లిక మాట్లాడుతూ, తెలంగాణలో విద్యకు కేవలం 7.6 శాతం నిధులు మాత్రమే కేటాయించగా, ఇతర రాష్ట్రాల్లో 15 శాతం కేటాయించారని అన్నారు. తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థినులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీరు, మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు పాఠశాలల నుంచి తమ ఇంటికి వెళ్లి రావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే 15 శాతం నిధులు విద్యకు కేటాయించి పాఠశాలల్లో సౌకర్యాల మెరుగుకు కృషి చేయాలన్నారు. జిల్లా కార్యదర్శులు అనుష, మైత్రి, లోరిట డ్యానియల్ మాట్లాడుతూ, బడ్జెట్‌లో తక్కువ నిధులు కేటాయించడం వల్ల రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని అన్నారు. అన్ని పాఠశాలల్లో వెంటనే మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు విద్యార్థుల రక్షణ కోసం ఆయాలు, వాచ్‌మెన్‌లను ఏర్పాటు చేయాలన్నారు. టాస్ ప్రతినిధులు సువర్ణ, భాగ్య, సుమలత, లావణ్య, మండల కన్వీనర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.



డీసీపీ రష్మీపెరుమాళ్‌తో విద్యార్థులు, ఉపాధ్యాయులు

చదువుతో పాటు ఆరోగ్య అలవాట్లపై అవగాహన కల్పించాలి: డీసీపీ

రెజిమెంటల్‌బజార్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు ఆరోగ్య అలవాట్లు, సామాజిక బాధ్యత పై అవగాహన పెంపొందించాలని నార్త్‌జోన్ డీసీపీ రష్మీపెరుమాళ్ అన్నారు. బుధవారం నార్త్‌జోన్ పోలీసుల ఆధ్వర్యం లో సికింద్రాబాద్ సెయింట్ ఆన్స్ పాఠశాలలో విద్యార్థులకు శారీరక, మానసిక ఆరోగ్యం, సైబర్ క్రైమ్, డ్రగ్స్ , జెండర్ సెన్సివిటీ తదితర పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ రష్మీ పెరుమాళ్ విద్యార్థులకు నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలు, వాటిని అధిగమించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శారీరకంగా, మానసికంగా ధృడంగా ఎదగడానికి ఆచరించాల్సిన అంశాలను వివరించారు. గోపాలపురం డివిజన్ ఏసీపీ, ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

అడ్డగుట్ట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్డగుట్ట శాస్త్రినగర్ ప్రాంతానికి చెందిన సాయి (22) ఈనెల 10న స్నేహితురాలు ఫోన్ చేసిందని బయటికు వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన తల్లి ఓదెమ్మ వెంటనే తుకారాంగేట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్నేహితురాలి సెల్‌ఫోన్ ఆధారంగా పోలీసులు గుర్తించేందుకు ప్రయత్నం చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి హత్య



హత్యకు గురైన వ్యక్తి మృతదేహం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వ్యక్తులు ఓ వ్యక్తి తలపై బండరాళ్లతో మోది దారుణంగా హత్య చేశారు. లోతుకుంట రైల్వే బ్రిడ్జి సమీపంలో ఈ ఘటన జరిగింది. సికింద్రాబాద్ రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ కథనం ప్రకారం.. లోతుకుంట రైల్వే బ్రిడ్జి సమీపంలో 50 ఏళ్ల వయస్సు గల వ్యక్తి చనిపోయి ఉండగా, విధి నిర్వహణలో ఉన్న రైల్వే ట్రాక్ కీ మెన్ గమనించి సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తులు బండరాళ్లతో తలపై మోది హత్య చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి కుడి చేతిపై ఆంజనేయ స్వామి పచ్చబొట్టు ఉందని పోలీసులు తెలిపారు. హత్యకు పాల్పడ్డ వ్యక్తుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.